క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎంను కలిసినవారిలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు

జగిత్యాల: హైదరాబాద్‌లోని మాజీమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్సీ, సీఎం రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉన్నారు.

పట్టణ పరిశుభ్రత పాటించాలి

జగిత్యాల: పట్టణ పరిశుభ్రతపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం తొలగించి ప్లాస్టిక్‌ను నివారించాలన్నారు. బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలని, సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

వెల్గటూర్: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ నార్త్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం భాగంగా గురువారం ఎండపల్లి మండలం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టల్ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే కరీంనగర్ డివిజన్‌లో ఇన్సూరెన్స్ రంగంలో అవార్డు పొందిన కొత్తపేట బ్రాంచి పోస్ట్‌మాస్టర్ బాలయ్యను సన్మానించారు. కార్యదర్శి గోమతి, మాజీ ఎంపీటీసీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: ఈనెల 5,6వ తేదీల్లో తలపెట్టిన బీసీల చలో ఢిల్లీ పోస్టర్‌ను గురువారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. బీసీల సమస్యలపై ఈనెల 5న జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపడతామని, 6న కేంద్ర మంత్రులతో చర్చలు జరుపుతామన్నారు. 7న కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో అఖిలపక్ష సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్, మారిశెట్టి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

కోరుట్లరూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు వైద్య, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుట్ల ఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి ఆనంద్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డెంగీ జ్వరాలు ప్రబలకుండా గ్రామీణులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీఎల్‌పీవో శంకర్, ఎంపీడీవో రామకృష్ణ, అయిలాపూర్ మెడికల్ ఆఫీసర్ తబుస్సుమ్ పాల్గొన్నారు.

నేడు భూ నిర్వాసితులతో సమావేశం

జగిత్యాలరూరల్: జాతీయ రహదారి- 63లో (ఆర్మూర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే రోడ్డు) భూములు కోల్పోతున్న నిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు జగిత్యాల రూరల్ తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. రైతులు తమహక్కు పత్రాలు, బ్యాంక్ వివరాలు సమర్పించాలని, శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎస్వీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహిస్తామని, భూ నిర్వాసితులు హాజరుకావాలని కోరారు.

రైతులకు నోటీసులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలో ఎన్‌హెచ్-63 రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు శుక్రవారం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ హక్కు పత్రాలు, ఇతర డాక్యుమెంట్లతో పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

భాషా సామర్థ్యాలను పెంచాలి

రాయికల్: విద్యార్థులలో భాషా సామర్థ్యాల పెంపునకు భాషోపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి ఎస్.రాఘవులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే న్యాస్ శిక్షణలో భాగంగా గురువారం రాయికల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాల తెలుగు పండితులకు సమావేశం నిర్వహించారు. తెలుగు రిసోర్స్ పర్సన్ చెరుకు మహేశ్వరశర్మ, మోతుకుల నారాయణగౌడ్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నీరు పారేదెలా..?

- పిచ్చిమొక్కలతో నిండిపోయిన డీ-53 కాలువ
- సాగునీటి సరఫరాకు ఆటంకం
- పట్టించుకోని యంత్రాంగం



పిచ్చిమొక్కలతో నిండిన ఎస్సారెస్పీ డీ-53 కాలువ

బుగ్గారం: పంటలకు సాగునీరందించే ఎస్సారెస్పీ కాలువలు అధ్వానంగా మారాయి. పూర్తిగా పిచ్చిమొక్కలు, చెట్లతో నిండిపోయి నీరు ప్రవహించేందుకు వీలు లేకుండా తయారయ్యాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులు వివిధ పంటల సాగులో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పసుపు, మిర్చి వంటి పంటల సాగును ఇప్పటికే ప్రారంభించారు. పంటలకు సాగునీరందించేందుకు ఎస్సారెస్పీ కాలువలే ఆధారం. వానాకాలం ప్రారంభమై రెండునెలలు దాటుతున్నా ఆశించిన రీతిలో వర్షాలు పడలేదు. దీంతో భూగర్భ జలాల మట్టం సైతం అంతగా పెరగలేదు.

వర్షం అంతంతే..

బుగ్గారం మండలంలోని అనేక ప్రాంతాల్లో లోటు వర్షపాతం వల్ల వ్యవసాయ బావుల్లోని నీరు పంటల చివరి దశకు అందడం కష్టసాధ్యమనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సాగునీటి కోసం పూర్తిగా ఎస్సారెస్పీ కాలువలపైనే ఆధారపడక తప్పదు. కానీ ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలు పూర్తిగా అధ్వానంగా మారాయి. పలుచోట్ల సిమెంట్ లైనింగ్ సైతం శిథిలమైంది. మండలంలోని మద్దునూర్ గ్రామశివారులో కొన్నిచోట్ల కాలువలపై పైపులు దెబ్బతినగా, మరికొన్నిచోట్ల లేకేజీలు ఉన్నాయి. దీంతో సాగునీరు వృథాగా పోయే అవకాశం ఉంది. వాటి గురించి స్థానిక రైతులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేరని వాపోతున్నారు.

కాలువపైనే ఆధారం

మండలంలోని వివిధ గ్రామాల రైతులు సాగునీటి అవసరాలకు డీ-53 కాలువపైనే ఆధారపడతారు. ఈ కాలువ కింద 11 ఉపకాలువలు, 13 చెరువులు ఉన్నాయి. అలాగే కాలువ పరిధిలో సాగయ్యే విస్తీర్ణం సుమారు 10 వేల ఎకరాలకు పైగా ఉంటుంది. ఇందులో ఎక్కువగా సాగయ్యే పంట వరి. ఇప్పటికే వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పంటకాలం పూర్తయ్యే వరకు నిరంతరం నీరు అవసరముంటుంది. ఈనేపథ్యంలో కాలువల్లో నీరు పారలేని విధంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి



మండలంలోని ప్రధాన కాలువ డీ-53తో పాటు దాని అనుబంధ ఉప కాలువలు పలుచోట్ల పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. నీరు ప్రవహించకుండా మారాయి. దీంతో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయి. అధికారులు ముందుగానే స్పందించి కాలువలను శుభ్రం చేయించే చర్యలు చేపట్టాలి.

– పాకాల శ్రీనివాస్, రైతు, మద్దునూర్



'రాళ్లవాగు' గలగల

జగిత్యాల - నిజామాబాద్ జిల్లాల సరిహద్దులో కథలాపూర్ మండలం భూషణరావుపేట శివారులో గల రాళ్లవాగు ప్రాజెక్టులోకి పుష్కలంగా నీళ్లు చేరాయి. రెండురోజులు కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి నీళ్లు చేరి మత్తడి దూకుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - కథలాపూర్

ఉపాధ్యాయులకు ఎల్లవేళలా మన్ననలు



కార్యక్రమంలో శోభారాణి తదితరులు

కోరుట్ల: విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను నెరవేర్చే ఉపాధ్యాయులకు ఎల్లవేళలా మన్ననలు దక్కుతాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి అన్నారు. కోరుట్ల బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన పరంకుశం శోభారాణి పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆనందరావు, కౌన్సిలర్ సజ్జు, అక్షర పాఠశాలల నిర్వాహకులు సిద్ధార్థ, డాక్టర్ వినయ్, మోహన్, ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఏఈ వేణు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం ఉంటే పరీక్షలు చేయించుకోవాలి

సాక్షి స్పందన



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని తదితరులు

మల్లాపూర్: జ్వర లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి అన్నారు. 'మంచం పట్టిన హుస్సేన్‌నగర్' శీర్షికన ఈ నెల 1న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామాన్ని ఎంపీడీవో, వైద్యాధికారులు సందర్శించి ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. విషజ్వరాలతో బాధపడుతున్న రోగుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో డెంగీ నిర్ధారణ అయినవారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసిబ్బందితో దోమల నివారణకు స్ప్రే చేయించారు. జగిత్యాల, మెట్‌పల్లి, ఇతర పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జగదీశ్, వైద్యాధికారి డా.వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి సదన్, ఏఎన్‌ఎం రమాదేవి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి తదితరులు

జగిత్యాల/పెగడపల్లి/మెట్‌పల్లిరూరల్/కోరుట్ల/సారంగాపూర్/రాయికల్: తల్లిపాలతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో పలు వార్డుల్లో కార్యక్రమం నిర్వహించారు. పెగడపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమతిబేగం తల్లిపాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. కోరుట్ల పట్టణం రహమత్‌పూర కేంద్రంలో తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. టీచర్లు అరుణ, ప్రేమలత, లక్ష్మి, పుష్పలత, రాజమణి, ఎ.లక్ష్మి పాల్గొన్నారు. తల్లిపాలతో పుట్టిన బిడ్డకు అధిక పోషకాలు అంది బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతుందని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. సారంగాపూర్ మండలం రేచపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధుకుమార్, సూపర్‌వైజర్లు శైలజ, లత పాల్గొన్నారు. రాయికల్ మండలం కిష్టంపేటలో సూపర్‌వైజర్ రాధ తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణ

కథలాపూర్: కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బొప్పరాతి నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ ఎండీ గౌసుర్ రహమాన్ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. కాగా ప్రిన్సిపాల్ నారాయణ జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారిగా కొనసాగుతారని ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సారంగాపూర్ ప్రిన్సిపాల్‌గా రమేశ్‌బాబు



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వై. రమేశ్‌బాబు నియమితులయ్యారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా చేసిన నారాయణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో రమేశ్‌బాబు బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్



జగదీశ్వర్‌గౌడ్

రాయికల్: రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సస్పెన్షన్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ ఎత్తివేయడంతో గురువారం మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. రాయికల్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రాజు



రాజు

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఎనుగంటి రాజు, ఉపాధ్యక్షుడిగా పల్లెర్ల నరేశ్, కోశాధికారిగా బద్దం సుధాకర్‌రెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతన నియామకం



నియామక పత్రం స్వీకరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మెట్‌పల్లిరూరల్: సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా పెద్దాపూర్‌కు చెందిన ఏపూరి శ్రీనివాస్‌గౌడ్ నియామకమయ్యారు.

కార్యవర్గం



నూతన కార్యవర్గం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామం రేణుక యూత్ అధ్యక్షుడిగా పెరుమండ్ల శివ, ఉపాధ్యక్షుడిగా తాళ్ల మధు, కోశాధికారి తాళ్ల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ మూల రమేశ్, సభ్యులు రాకేశ్, సాయి, అజయ్, వెంకటేశ్, నాగరాజు ఎన్నికయ్యారు.

రుణమాఫీ అమలుపై అపూర్వ స్పందన



మాట్లాడుతున్న నర్సింగరావు

మల్లాపూర్: రైతులకిచ్చిన మాటకు కట్టుబడి ఆర్థిక ఇబ్బందులున్న రూ.2లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంతో ప్రజలు, రైతుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. గ్రామాల్లో ఊరేగింపుగా రైతులు రైతువేదికల వద్దకు వెళ్తుంటే ఒక పండుగ వాతావరణం కనబడుతుందని పేర్కొన్నారు. కొంతమంది రైతులు రుణమాఫీ కాలేదని బాధపడవద్దని, వ్యవసాయ అధికారులతో ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ నిర్వహించి వారికి కూడా త్వరలోనే మాఫీ చేస్తుందన్నారు. అంతకుముందు నర్సింగరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాలకు రోడ్డు నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు మరిపెల్లి మల్లయ్యతో పాటు మరో రెండు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గజ్జి గంగారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పూండ్ర లక్ష్మారెడ్డి, ఎల్కా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నిరసన



కథలాపూర్‌లో నిరసన తెలుపుతున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, నాయకులు



కోరుట్లలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కోరుట్ల/కథలాపూర్/పెగడపల్లి/బుగ్గారం/ధర్మపురి/మెట్‌పల్లి/గొల్లపల్లి: శాసనసభలో మహిళ ఎమ్మెల్యేల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయా పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో రోడ్లపై నిరసన తెలిపారు. పలుచోట్ల సీఎం దిష్టిబొమ్మను దహనం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కథలాపూర్‌లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, కోరుట్ల పట్టణంలో మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సీనియర్ నాయకుడు చీటి వెంకట్రావు, పెగడపల్లిలో అధ్యక్షుడు మల్లారెడ్డి, బుగ్గారంలో గాలిపెల్లి మహేశ్, చీర్నేని మల్లేశం, ధర్మపురిలో అయ్యోరి రాజేశ్, గొల్లపల్లిలో జలేందర్, ఆయా పట్టణ, మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం



జగిత్యాలటౌన్: తహసీల్ చౌరస్తాలో నాయకుల సంబరాలు

జగిత్యాలటౌన్/కోరుట్లరూరల్/కథలాపూర్/గొల్లపల్లి/సారంగాపూర్: 30 ఏళ్ల పోరాట ఫలితంగా విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో ఎస్సీ, ఉపకులాలకు ప్రయోజనం కలిగేలా సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకమని జగిత్యాల పట్టణ, నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం తహసీల్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. అన్ని రాష్ట్రాల కంటే ముందుగానే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేపడతామని అసెంబ్లీలో ప్రకటన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీపీ ధర రమేశ్‌బాబు, జగిత్యాల బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు శుభసూచకమని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనతడుపుల అంజయ్య అన్నారు. గురువారం కోరుట్లలో మాట్లాడారు. కౌన్సిలర్ సత్యం, కళ్యాణ్, ఆనంద్, వినోద్, తుక్కారాం పాల్గొన్నారు. కథలాపూర్‌లో టపాసులు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కాశవత్తుల లక్ష్మీరాజం, మండలాధ్యక్షుడు ఆమెట రాజు, నాయకులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సంతోషంగా ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్ మాదిగ అన్నారు. సారంగాపూర్‌లో నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. మెదిగం మధు, చంద్రయ్య, చందు తదితరులు ఉన్నారు. తీర్పు అభినందనీయమని ఎమ్మార్పీఎస్ నాయకుడు చిర్ర దిలీప్ గొల్లపల్లిలో ఆనందం వ్యక్తం చేశారు.

బాధిత మహిళల ఆందోళన



ఇంటిముందు ఆందోళన చేపట్టిన మహిళలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన రేగొండ నరేశ్ సమీప ప్రజల నుంచి రూ.20 కోట్ల మేర అప్పు చేసి ఇటీవల పరారయ్యాడు. దీంతో అప్పు ఇచ్చిన వారంతా వారంక్రితం ఆందోళనకు దిగారు. సదరు వ్యక్తి ఇంటిని మంచిర్యాలకు చెందిన శ్రావణ్ కొనుగోలు చేశాడు. ఇంటిని శుభ్రం చేసేందుకు శ్రావణ్ రాగా.. బాధితులు నరేశ్‌ను తీసుకొస్తేనే ఇంట్లోకి వెళ్లాలంటూ ఇంటిముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి శాంతింపజేశారు.

సంక్షిప్త వార్తలు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఇబ్రహీంపట్నం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గురువారం మండలంలోని యామపూర్‌లో పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, ఏఎన్‌ఎం సుప్రియ, ఆశ వర్కర్ మౌనిక, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

రాయికల్: పట్టణంలోని 11వ వార్డులో వన మహోత్సవంలో భాగంగా వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ గురువారం మొక్కలు పంపిణీ చేశారు.

రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం: బీసీ కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరె రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని వేములకుర్తిలో మాట్లాడారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ఇబ్రహీంపట్నం: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ అనిల్ కోరారు. గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో జౌడం భీమయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.16 వేలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో మంజూరు కాగా గురువారం కాంగ్రెస్ నాయకులు సదరు చెక్కును అందజేశారు.

రైతుబీమా కల్పించాలని వినతి

గొల్లపల్లి: బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన రైతులకు రైతుబీమా కల్పించి వారి కుటుంబ సభ్యుల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని మాజీ ఎంపీటీసీ గోవిందుల లావణ్య జలపతి గురువారం ఏవోకు వినతిపత్రం అందజేశారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కథలాపూర్: మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణను గురువారం మండలంలోని అంబారిపేట గ్రామ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

వెల్గటూర్ : అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గురువారం ఎండపల్లి విలేకరులు తహసీల్దార్ రవికాంత్‌కు వినతిపత్రం సమర్పించారు. బాలసాని శ్రావణ్‌మార్ తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో దొంగతనం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన ఎండీ.అప్సర ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంటి తాళం పగులగొట్టి చొరబడి బీరువాను ధ్వంసం చేసి రూ.50వేలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై నవీన్‌కుమార్ సంఘటనస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదు

సారంగాపూర్: రుణమాఫీపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయంలో ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేసిందో నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సాంకేతి కారణాలతో రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.

వంతెనపై మొరాయించిన గ్రానైట్ లారీ



వంతెనపై నిలిచిపోయిన గ్రానైట్ లారీ

మల్యాల: మండలంలోని రామన్నపేట- మద్దుట్ల గ్రామాల మధ్య ఉన్న వరద కాలువ వంతెనపై గురువారం గ్రానైట్ లారీ మొరాయించింది. మద్దుట్ల క్వారీ నుంచి గ్రానైట్‌తో వెళ్లే లారీలతో గ్రామంలో రోడ్లు దెబ్బతినడంతో పాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రానైట్ లారీలను జనావాసాల నుంచి అనుమతించవద్దని, బైపాస్ రహదారి వెంట వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రాయికల్: రాయికల్ మెప్మా ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. టీఎంసీ శరణ్య, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది ప్రత్యూష, అశ్విని, సుజాత, సుష్మ తదితరులు పాల్గొన్నారు.